

# ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు వేగవంతం

## దేవరకొండ వైపు నుంచి వారం రోజుల్లో 20 మీటర్లు తవ్వకం పూర్తి : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్టు పనులు మళ్లీ వేగం పుంజుకున్నాయని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. దేవరకొండ అవుట్‌లెట్ వైపు నుంచి గత వారం రోజుల్లో సుమారు 20 మీటర్ల తవ్వకం పూర్తయిందని వెల్లడించారు. శనివారం సచివాలయంలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. టన్నెల్–1, టన్నెల్–2 పనుల పురోగతి, మానవ వనరులు, యంత్రాల వినియోగం, నిర్దేశించిన గడువు తదితర అంశాలపై చర్చించారు. పనిస్థలంలో భద్రతా చర్యలు, గాలి ప్రసరణ , నీటి తొలగింపు ఏర్పాట్లపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయడమే లక్ష్యంగా భారీ స్థాయిలో సిబ్బంది, సామగ్రిని ప్రాజెక్టు వద్దకు తరలించామని తెలిపారు. ఖచ్చితమైన డ్రిల్లింగ్ విధానాలు, ఆధారిత టన్నెలింగ్ పద్ధతులను అనుసరిస్తూ భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు.టన్నెల్ లోపల గాలి ప్రసరణ సమస్యలను అధిగమించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇన్‌లెట్ వైపు దోమలపెంట ప్రాంతం నుంచి కూడా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని, 20 మీటర్ల ఓపెన్ కట్‌తో పాటు అదనపు భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. మరిన్ని విద్యుత్, వెంటిలేషన్ పరికరాలను దిగుమతి చేసుకుంటున్నామని, వారం రోజుల్లో పూర్తి స్థాయి పనులు ప్రారంభమయ్యే అవకాశముందని చెప్పారు.2025 ఫిబ్రవరి 22న ఇన్‌లెట్ వైపు వద్ద జరిగిన దుర్ఘటనలో పైకప్పు కూలిపోవడంతో పనులు నిలిచిపోయ్యాయని, దీంతోభద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని షెడ్యూల్‌కు అనుగుణంగా 24 గంటల పనులు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2027 చివరినాటికి టన్నెల్ పురోగతి నిసాధించి, 2028 జూన్ నాటికి పూర్తిస్థాయి పనులు ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. భౌగోళిక సమస్యల కారణంగా టన్నెల్ బోరింగ్ మెషీన్ (టిబిఎం) పద్ధతికి బదులుగా పరిశీలన ఆధారిత సురక్షిత విధానాలను అవలంబిస్తున్నట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజనీర్ఇన్‌చీఫ్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్ ఫౌండేషన్‌లో క్యాన్సర్ అవగాహన స్క్రీనింగ్ శిబిరం

## నిరుపేద వర్గాలకు ఇలాంటి శిబిరాలు ఎంతో అవసరం

### సిఆర్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి






**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సమాజంలో అత్యున్నత స్థాయి రోగ నిర్ధారణ సౌకర్యాలు అందుబాటులో లేని నిరుపేద వర్గాలను చేరుకోవడానికి ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరమని సిఆర్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సిఆర్ పాలీక్లినిక్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హస్పటల్స్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్, గ్రేటర్ హైద్రాబాద్ రోటరీ క్లబ్ సంయుక్త సహకారంతో సిఆర్ ఫౌండేషన్‌లో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పల్లా వెంకట్ రెడ్డి, సిఆర్ పాలీక్లినిక్ డైరెక్టర్ రజనీ, సిఆర్ పాలీక్లినిక్ సిఇఒ డి. శ్రీనివాస రావు, సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం డైరెక్టర్, కోశాధికారి చేన్నకేశవరావులు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ముందస్తు క్యాన్సర్ వ్యాధి గుర్తింపు, పెరుగుతున్న వ్యాధి ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి కొండాపూర్ లోని సిఆర్ ఫౌండేషన్‌లో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేశారని క్యాన్సర్ నివారణ, ఆరోగ్యం పట్ల పమాజంలో పెరుగుతున్న ఆందోళనను ప్రతిబింబిస్తూ వైద్య శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్క్రీనింగ్ టెస్టులను చేయించుకున్నారని సీనియర్ సిటిజన్లు, మధ్య వయస్కులైన వ్యక్తులతో సహ దాదాపు 130 మంది ఉచిత క్యాన్సర్ సమగ్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. పరీక్షలలో ప్రారంభ లక్షణాలతో గుర్తింపబడిన వారికి తదుపరి మందులు, సంరక్షణ కోరకు అవసరమైన సిఫార్సులు అందించారని తెలిపారు. కార్యక్రమంలో బసవతారకం ఆసుపత్రి వైద్యులు సీనియర్ మెడికల్ కన్సల్టెంట్లు డా. ప్రభాకర్, రేడియాలజిస్ట్, డిఎంవోలు డా. రేణుక, డా. సౌమ్య, డా. అబ్దుల్, డా. ప్రేరణ సిబ్బందితో సహ ఇతర ప్రముఖులు రోటరీ క్లబ్ డైరెక్టర్ రిటర్న్ యం. విజయ భాస్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.


### ఈ-కార్ రేస్ కేసులో

# రేపు చార్జ్‌షీట్ దాఖలకు ఎసిబి సిద్ధం

## కెటిఆర్, అరవింద్‌కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలపై అభియోగాలు..?

## గ్రీన్‌కోకు క్లీన్ చీట్..?







**ప్రజాపక్షం/హైదరాబాద్:**హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములాఈ కార్ రేసుకు సంబంధించిన అవినీతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. తెలంగాణ ఎసిబి అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మాజీ మంత్రి కె.టి.రామారావు, ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలపై నమోదు చేసిన కేసులో దర్యాప్తు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ కేసులో నిందితుల జాబితాలో ఉన్న అరవింద్‌కుమార్‌ను ప్రాసిక్యూషన్ కోసం కేంద్రం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ అనుమతి రాగానే అతన్ని సస్పెండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎసిబి అధికారులు సోమవారం కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారని సమాచారం.ఈ చార్జ్‌షీట్‌లో కెటిఆర్, అరవింద్‌కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలపై అభియోగాలు మోపనున్నారని, గ్రీన్‌కో సంస్థకు క్లీన్ చీట్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

**నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు**

హైదరాబాద్‌లో 2023లో జరిగిన ఈకార్ రేస్ నిర్వహణలో ప్రభుత్వ నిధులను నిబంధనలు ఉల్లంఘించి వినియోగించారనే ఆరోపణలపై ఎసిబి కేసు నమోదు చేసింది. హెచ్ఎండిఎ నిధుల నుంచి సుమారు రూ.54 కోట్లు క్యాబినెట్ అనుమతి లేకుండా విడుదల చేశారని, విదేశీ సంస్థకు నేరుగా చెల్లింపులు జరిపారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. రేసుకు ప్రధాన స్పాన్సర్‌గా ఉన్న గ్రీన్‌కో సంస్థ ఆర్థిక లావాదేవీలను కూడా ఎసిబి పరిశీలించింది. కంపెనీ ప్రతినిధులైన చెలమసెట్టి అనీల్‌కుమార్, మహేష్ కొల్లిలను కూడా విచారించారు. గ్రీన్‌కో సంస్థలపై ఎసిబి దాడులు చేసి పలు పత్రాలను స్వాధీనం చేసుకుంది. రేస్ కోసం గ్రీన్‌కో అదనంగా సుమారు రూ.150 కోట్లు ఖర్చు చేసినట్లు దర్యాప్తులో బయటపడింది సంబంధిత ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు,నిధుల విడుదల ప్రక్రియను పరిశీలించారు. విదేశీ చెల్లింపుల వివరాలను ఎసిబి సేకరించింది. ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. అంతర్జాతీయ స్థాయి ఈవెంట్ నిర్వహణలో అవకతవకలు జరిగాయా అనే అంశంపై అధికార–ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం కొనసాగుతోంది. చార్జ్‌షీట్ దాఖలు జరిగితే కేసు న్యాయపరమైన దశలోకి ప్రవేశిస్తుంది. ఇందులో ఉన్న ఆరోపణలు, సాక్ష్యాలు, నిందితుల పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధి చిహ్నంగా ప్రారంభమైన ఫార్ములాఈ కార్ రేసు ఇప్పుడు అవినీతి ఆరోపణల కేసుగా మారి కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోంది. నేడోరేపో ఎసిబి అధికారులు కోర్టులో దాఖలు కానున్న చార్జ్‌షీట్ ఈ కేసు భవిష్యత్తును నిర్ణయించనున్నట్లు భావిస్తున్నారు.

# అంబేద్కర్ గొప్ప సామాజిక శాస్త్రవేత్త

## విసి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ఎంత మంది శాస్త్రవేత్తలు ఉన్నా, వాళ్ళు వారి వారి రంగాల్లో విశేష పరిశోధనలు చేసి దేశాభివృద్ధికి పాటు పడ్డారని, అయితే ఈ దేశంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం పరితపించిన రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్. అంబేద్కర్ గొప్ప సామాజిక శాస్త్రవేత్త అని విసి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అభిప్రాయపడ్డారు. డా.బిఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో భారత భౌతిక శాస్త్రవేత్త సర్ సివి. రామన్ గౌరవార్థం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఏ దేశం అయినా సైన్స్ ను నమ్ముకొని, పలు రంగాల్లో వస్తున్న ఆర్థిక, సాంకేతిక మార్పులకు అనుగుణంగా ముందుకు వెళ్ళాలని అప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ప్రధాన వక్తగా ప్రఖ్యాత పరిశోధకులు, అంతర్జాతీయ పంటల పరిశోనా సంస్థ ఇక్రిసాట్ తెలంగాణ డైరెక్టర్ జనరల్ డా.హిమాన్ష్ పాఠక్ హాజరై భారతదేశ వ్యవసాయ విప్లవం సైన్స్ తో కొరత నుండి మిగులు అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్, సైన్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ జి. పుష్పా చక్రపాణి మాట్లాడుతూ ప్రఖ్యాత భారతీయ పరిశోధకులు సర్ సి.వి.రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్ ను గుర్తించుకునేలా ఆయన పేరున జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరపడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు యస్.వి.రాజశేఖర్ రెడ్డి, సైన్స్ విభాగ అధ్యాపకులు శ్రీదేవి, కె. ప్రమీలా కేతావత్, డా. కిషోర్, డా. రామకృష్ణ, డా.ఎస్.రజిత, డా.వై.కుమార్, డా.నరసయ్య బట్టు, డా. వై.అశోక్, పలు విభాగాల డైరెక్టర్లు, డీన్స్, సైన్స్ విభాగ విద్యార్థులు, బోధన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విభాగాల విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు, ప్రత్యేకంగా రూపొందించిన రోబో తో పాటు పలు రకాల పాముల ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచాయి.

### రాజ్యసభ నామినేషన్‌పై

# శ్యామ్ మోహన్ ఆశాభావం

## ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ చర్యల కమిటీ ఉపాధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్యామ్ మోహన్ అనంతుల తన ఆరు దశాబ్దాలకుపైగా పార్టీకి అందించిన సేవలను భారత జాతీయ కాంగ్రెస్ గుర్తించి, తెలంగాణ నుంచి రాజ్యసభకు తనను నామినేట్ చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు దాని సిద్ధాంత పరిరక్షణకు తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. నేడు ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) కె.సి. వేణుగోపాల్ తదితర సీనియర్ నాయకులతో భేటీ కానున్నారు. ఏప్రిల్‌లో తెలంగాణ నుంచి రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సమావేశాల్లో సంస్థాగత అంశాలు, తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అలాగే రాజ్యసభ ఎన్నికల వ్యూహంపై చర్చలు జరిగే అవకాశం ఉంది. పార్టీ పట్ల నిరంతర నిబద్ధత, విశాల అనుభవం, గ్రామస్థాయిలో బలమైన అనుబంధం కారణంగా శ్యామ్ మోహన్ అనంతుల పేరు ప్రముఖ అభ్యర్థుల జాబితాలో వినిపిస్తోంది. జాతీయ నాయకత్వంతో ఆయన భేటీలు పార్టీ వర్గాల్లో ఆసక్తిగా గమనించబడుతున్నాయి.




### ఆధిపత్యాలను ధిక్కరిస్తూ

# కళాలు గళాలు లేవాలి

## పలువురు కవులు, రచయిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమత్వమే ప్రాణంగా సాహిత్యం రావాలని, అన్ని రకాల ఆధిపత్యాలను ధిక్కరిస్తూ కళాలు గళాలు లేవాలని పలువురు కవులు రచయితల ఉద్ఘాటించారు. కష్టం చేసే ప్రతి ఒక్కరికి ఫలితాలు దక్కాలని, ఆ దిశగా కొత్త తరం కలాలను పదునెక్కించాలని పిలుపునిచ్చారు.శనివారం నాడు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భూదాన పరిరక్షణ ఉద్యమ కారుడు రాజేందర్ రెడ్డి అధ్యక్షత జరిగిన డాక్టర్ షహబాజ్ అహ్మద్ ఖాన్ రచించిన గుండె నెత్తుటి సిరా కవిత్వ సంకల నాన్ని ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవి, ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్,తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ బహుజన కవి జూలూరు గౌరీ శంకర్, సీనియర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమకారుడు పాశం యాదగిరి, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ ప్రఖ్యాత రచయిత మాడభూషి శ్రీధర్, ఆదర్శవంతమైందని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్, సీనియర్ జర్నలిస్ట్, తొలి వెలుగు ఛానల్ ఎడిటర్ రఘు, రచయిత జలరంగ నిపుణులు శ్రీధర్ రావు దేశ్ పాండేలు పాల్గొని ప్రసంగించారు. . ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ సమాజానికి మూల స్తంభం కవి అని, సమాజంలో జరుగుతున్న సాధారణ సంఘటనలను అందరి సమస్యలుగా మలిచి ఆలోచింపజేసేది కవిత్వమని పేర్కొన్నారు. షహబాజ్ దేశంలోని సమస్యలతో పాటు అంతర్జాతీయంగా ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా దార్శనిక దృష్టితో రాశారని విశ్లేషించారన్నారు. నిజానికి నిజమే అంతుచిక్కకుండా పోతున్న కాలంలో కవిత్వం గుండె లోతుల్లోంచి ఎగిసి పడాలన్నారు. పుస్తక రచయిత డాక్టర్ శేహబాజ్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అధఃపాతాళానికి హైదరాబాద్

## బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెండు సంవత్సరాల కాలంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అధఃపాతాళానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుపోయారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం తన ఆర్థిక ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల కోసం మాత్రమే రేవంత్ రెడ్డి పరిపాలన చేస్తున్నాడని, అందుకే భూములే లక్ష్యంగా అక్రమ సంపాదన కోసమే పూర్తి స్థాయిలో హైదరాబాద్ నగరాన్ని పతనానికి పడగొట్టారని కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం వేల కోట్ల రూపాయలను రాష్ట్ర రాజధాని నుంచి దోచుకోవడానికి 'హైడ్రా' నుంచి మొదలుకొని, పారిశ్రామిక భూముల స్కామ్, టిడిఆర్ పేరిట మరొక స్కామ్, ఇలా ఫోర్త్ సిటీ భూముల కుంభకోణం రేవంత్ రెడ్డి 24 నెలలుగా చేసింది కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారమే అని కెటిఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో, అక్రమ సంపాదన లక్ష్యంగా తన భూములకు విలువ తీసుకురావడం కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో ఉన్న సిటీని పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో భారత రాష్ట్ర సమితి, జిహెచ్ఎంసి నగర పరిధిలోని పార్టీ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, మాజీ మంత్రులు, నియోజకవర్గ ఇంచార్జ్‌లతో కెటిఆర్ ఒక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ, అసెంబ్లీ సమావేశాల్లో నగరానికి సంబంధించి లేవనెత్తాల్సిన అంశాలు వంటి వాటిని విస్తృతంగా చర్చించారు. పార్టీ పరంగా అటు ప్రభుత్వం పైన చేయాల్సిన పోరాటానికి సంబంధించిన అంశంలో కెటిఆర్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నగరంలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల కోసం కేంద్ర పార్టీ కార్యాలయం, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, జిహెచ్ఎంసి పార్టీ కార్యక్రమాలను, నాయకులకు సంబంధించిన కార్యకలాపాల సమన్వయం, ఫాలోఅప్ కోసం జిహెచ్ఎంసికి ఎంఎల్‌సి దాసోజు శ్రావణ్, మాజీ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్, మల్కాజిగిరి కార్పొరేషన్‌కి ఎంఎల్‌సి శంబిపూర్ రాజు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కి ఎంఎల్‌సి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు కెటిఆర్ బాధ్యతలు అప్పగించారు.

### టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఐఎస్ కార్యదర్శిగా

# బాధ్యతలు స్వీకరించిన విజయేందిర బోయి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఐఎస్) కార్యదర్శిగా విజయేందిర బోయి హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని ప్రధాన కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఐఎస్ కార్యదర్శిగా ఉన్న ఎస్. కృష్ణ ఆదిత్య నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. దీంతో పాటు విజయేందిర బోయి షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా కూడా సేవలందించనున్నారు. ఈ నియామకం ద్వారా షెడ్యూల్ కులాల సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత బలోపేతం కానుంది. బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆమె మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. అదే విధంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, రవాణా శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా, అలాగే రోడ్లు, భవనాల శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా కీలక పదవులను నిర్వహించారు. విస్తృత పరిపాలనా అనుభవం కలిగిన ఆమె నాయకత్వంలో టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఐఎస్ సంస్థ విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విద్యార్థుల సమగ్ర వికాసంలో మరింత పురోగతి సాధిస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఐఎస్ అధికారులు, సిబ్బంది విజయేందిర బోయికి హృదయపూర్వక స్వాగతం పలికి, ఆమె నాయకత్వంలో సంస్థ మరిన్ని విజయాలను సాధిస్తుందని ఆకాంక్షించారు.

# దాడుల్లో 352 మంది అఫ్గాన్ తాలిబన్లు మృతి

## పాకిస్థాన్‌తో చర్చలకు ప్రతిపాదన

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌తో శాంతి చర్చలకు అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం ప్రతిపాదన చేసింది. అఫ్గానిస్థాన్‌పై పొరుగుదేశం పాకిస్థాన్ 'ఓపెన్ వార్' ప్రకటించిన తర్వాత అనేక ప్రాంతాలపై అఫ్గానిస్థాన్‌లో దాడులు కొనసాగాయి. సరిహద్దు ప్రాంతాలలో దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 352 మంది తాలిబన్లు హతులైనట్లు, మరో 500 మంది గాయపడ్డారని పాకిస్థాన్ అధికారులు శనివారం ప్రకటించారు. ఈ నష్టాలు చవిచూసిన తర్వాత అఫ్గాన్ ప్రభుత్వం దిగివచ్చింది. పాకిస్థాన్‌తో శాంతి చర్చలకు ప్రతిపాదన చేసింది. పాకిస్థాన్ దళాలు పూర్తిగా 104 అఫ్గానిస్థాన్ సైనిక కేంద్రాలను ధ్వంసం చేశాయని, మరో 22 సరిహద్దు ప్రాంత సైనిక కేంద్రాలను స్వాధీనం చేసుకున్నామని పాకిస్థాన్ సమాచార శాఖామంత్రి అతుల్లా తరర్ ప్రకటించారు. 163 సాయుధ వాహనాలను కూడా ధ్వంసం చేశామని, 37 ప్రాంతాలపై గగనతల దాడులు చేశామని చెప్పారు. ''ఆపరేషన్ ఘజాబ్ లిల్ హక్'' అనే కోడ్ నేమ్‌తో పాకిస్థాన్ సైనిక దళాలు భారీ ఎత్తున సామూహిక దాడులు అఫ్గానిస్థాన్‌పై చేశాయి. రెండు దేశాలమధ్యా 2,600 కి.మీ నిడివిగల సరిహద్దు ప్రాంతం ఉంది. ఈ దాడుల్లో తొలుత 53 ప్రాంతాలలో అఫ్గానిస్థాన్ దాడులు చేసింది.

## ఐక్యరాజ్యసమితి ఖండన

**మాస్కో:** పశ్చిమ ఆసియాలో యుద్ధ దాడులను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దాడులు అంతర్జాతీయ శాంతి,చ స్థిరత్వాలను దెబ్బతీస్తాయన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడులు, దానికి ప్రతిగా పశ్చిమ ఆసియా అంతటా ఇరాన్ ప్రతీకార దాడులు అంతర్జాతీయ శాంతికి, భద్రతకు విఘాతం కలుగుతుందని అన్నారు. ట్రంప్ ఇప్పుడు తన అసలు రంగు బయట పెట్టారని రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ దిమ్త్రీ మెద్వెదేవ్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ప్రస్తుతం కొనసాగుతున్న తన దౌత్య మార్గాన్ని వదిలిపెట్టేశారని, దౌత్యం వెనుక ఉన్న తన అసలైన ఉద్దేశాలను బహిర్గతం చేశారని విమర్శించారు. ఇక ఇరాన్‌తో చేసే దౌత్యపరమైన సంప్రదింపులు ఎప్పటికీ నిజాయతీగా ఉండబోవన్న విషయం తేటతెల్లమైపోయిందన్నారు.

# కాంగ్రెస్‌ది కూల్చివేతల ప్రభుత్వం

## కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ది కూల్చివేతల ప్రభుత్వమని, ఇళ్లను, గుడులను కూలుస్తున్నారని, ఇలాగే కొనసాగితే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి వేస్తారనికేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారంబిజెపి ఎస్‌సిమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవ లక్ష్మీ నారాయణ, మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పు భాష తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధికి అవసరమైన సిఫారసులు చేయకుండా ఉపాధ్యాయుల జీతాలు తగ్గించాలంటూ విద్యా కమిషన్ నివేదిక ఇవ్వడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ''విద్యా కమిషన్ నివేదిక ఇచ్చిన వ్యక్తులకే నైతికత లేదన్నారు.ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా ఎసి గదుల్లో కూర్చుని రూపొందించిన నివేదికను చెత్తబుట్టలో వేయడానికి కూడ పనిరాదని, మూసీలో విసిరివేయాల్సిందేన్నారు. ఈ నివేదిక ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసి అవమానించేలా ఉందన్నారు. టీచర్లలంతా ఏకమవ్వాలని ఉపాధ్యాయుల పక్షాన బిజెపి అండగా ఉంటుందని తెలిపారు. ఉత్తీర్ణత మార్కులను 35 నుండి 45కు పెంచాలని చేసిన సిఫారసులను అమలు చేస్తే పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

# కడియం శ్రీహరి తనసుతాను వ్యక్తిత్వ హణనం

## కెపి వివేకానంద

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి పార్టీ మారిన కడియం శ్రీహరి తనకు తను వ్యక్తిత్వ హణననికి పాల్పడ్డారని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి. వివేకానంద పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కడియం శ్రీహరి బయట తొడలు కొడుతూ లోపల పిల్లి గంతులు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. కడియం శ్రీహరి స్పీకర్‌ను తప్పుదోవ పట్టించొచ్చు కానీ న్యాయ స్థానంలో తప్పించుకోలేడని , తగిన గుణపాఠం తప్పదని కెపి వివేకనంద హెచ్చరించారు.

# కెసిఆర్ కంటే రేవంత్‌రెడ్డి వెయ్యి రెట్లు నయం

## హరీష్‌రావు వాఖ్యలపై స్పందించిన ఆకునూరి మురళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'మీ కెసిఆర్ కంటే రేవంత్ రెడ్డి వెయ్యి రెట్లు నయం. నెలకు ఒక రివ్యూ పెడుతున్నాడు, కమిషన్ వేసాడు, విసిల నియామకం చేసాడు, పది వేల కొత్త టీచర్లను నియమించాడు. కెసిఆర్ ఒక్క గంట అయినా విద్యా మీద రివ్యూ పెట్టిండా? విద్య మీద రాజకీయాలు వద్దు అండి హరీష్ రావు. మీ టీం సరిగ్గా హోమ్ వర్క్ చేసినట్టు లేదు చూసుకోండి' అని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళి ఎక్స్ వేదికగా స్పందించారు. 'బిఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను భ్రష్టుపట్టించిన మాజీ మంత్రి హరీష్‌రావుకు విద్య గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, కమిషన్ రిపోర్ట్ మొదటి పేజీ కూడా చదవనట్టుంది. అందుకే అందులో ఉన్న విషయాల మీద రాయకుండా మా టీం విద్యార్హతల మీద ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడమేంటి బాబు? మమ్మల్ని అడిగితే మా అందరి సివి(విద్యార్హత) లు ఇచ్చేవాళ్ళము కదా. మా ఆఫీస్ టీంలోనే ఆరుగురు పిహెచ్‌డిలు (అందరూ టీచింగ్ అనుభవం ఉన్నవాళ్లే), ఒక ఎన్ఐటి, ఒక ఐఆర్ ఎంఎ, ఒక లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్(పబ్లిక్ పాలసీ)లు ఉన్నారు. 22 మంది ప్రొఫెసర్లు (అందరూ ఎడ్యుకేషనలిస్ట్‌లే, టీచింగ్ అనుభవం ఉన్నవాళ్ళే) డైరెక్ట్‌గా వర్కింగ్ గ్రూప్స్ ద్వారా పాల్గొన్నారు. ఆకునూరి మురళి ఒక్కడు వ్రాయడు రిపోర్ట్, గా మాత్రం తెలియదా మీకు, పాలసీ రిసర్చ్ ఎట్లా చేస్తారో? కింద చూడండి కమిషన్ ఏం పని చేసిందో, ఎట్లా పని చేసిందో మీకు అర్థం అవుతుంది. మీది ఎట్లా ఉందంటే 'ఆడలేక మద్దెల వోడు' అన్నట్టుంది' అని ఆకునూరి మురళి చెప్పుకొచ్చారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుంది

## కార్మిక పరిశ్రమలశాఖ మంత్రి గడ్డం వివేక్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని కార్మిక పరిశ్రమలశాఖ మంత్రి గడ్డం వివేక్ తెలిపారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ ప్రతాప్‌సింగారంలో శనివారం స్పాట్‌లైట్ క్రికెట్ మైదానంను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌కు చాలా ఆదరణ ఉందని గుర్తుచేశారు. క్రీడాకారులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుదని ప్రతిరోజు సాధన చేయడంతో విజయాలు సొంతం అవుతాయన్నారు. మంత్రి క్రికెట్ మైదానంను ప్రారంభించి బ్యాటింగ్ చేశారు. అనంతరం ప్రతాప్ సింగారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. చిన్నారులు చేసిన పరిశోధనలను మంత్రి తిలకించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రా రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేష్, తుంగతుర్తి రవి, హనుమంత్ రెడ్డి,పోచారం అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గ్యార రవి,అంజయ్య యాదవ్, బాల్‌రాజ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్ష సామగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/ఉప్పల్ :** త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నాచారం డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి తమ తల్లి దండ్రులకు, గురువులకు అలాగే ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తూ విద్యకు ప్రోత్సాహం అందిస్తున్న సాయిజెన్ శేఖర్‌ను ఆయన అభినందించారు. అలాగే భవిష్యత్తులో ఎంబిబిఎస్ ర్యాంక్ సాధించే విద్యార్థులకు ఐదు సంవత్సరాల పాటు పూర్తిస్థాయిలో చదువు ఖర్చులు భరిస్తానని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 200 మందికి పైగా విద్యార్థుల ఫీజులు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా పూర్తి కమిటీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా పూర్తిస్థాయి కమిటీని అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయచారి(వార్త), ఆదిమూలం శ్రీనివాస్(సాక్షి), కోశాధికారి వట్టిపల్లి సురేష్(జనంసాక్షి)లు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా పవన్ (సాక్షి), బాల్‌రెడ్డి(మనతెలంగాణ), జాయింట్ సెక్రెటరీగా రోజారాణి(ధరణి), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గడ్డమీది బాల్‌రాజ్‌గౌడ్(నమస్తే తెలంగాణ), సలహాదారులుగా చంద్రమౌళి(ఈనాడు), కెసి మోహన్(నమస్తేతెలంగాణ), కడియాల రమేష్(నమస్తేతెలంగాణ), శ్రీనివాస్‌రావు(ఆంధ్రప్రభ), క్యాసాని సత్యనారాయణ(నవ తెలంగాణ), ఉల్లోజు శ్రీనివాస్ (ఆంధ్రప్రభ), కేసరి సహదేవచారి(ఆంధ్రజ్యోతి), వేముల శంకర్(ఆంధ్రజ్యోతి), సిరా శ్రీనివాస్(ఆంధ్రజ్యోతి), బి.విజయ్‌కుమార్(దిశ), రుద్రగోని నర్సింగ్‌గౌడ్(ప్రజాపక్షం)లు ఎన్నికయ్యారని ప్రకటించారు.



# మత్స్యకారుల సంక్షేమంపై చిన్నచూపు

## తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన హైమారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మత్స్యకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని 'మహిళా శక్తి మై వాయిస్' వ్యవస్థాపక సంఘం అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి అన్నారు. శనివారం మత్స్యకారుల సంఘం సభ్యులతో కలిసి శామీర్‌పేట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తహసీల్దార్ సుచరితను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులకు పంపిణీ చేస్తున్న చేప పిల్లలను సకాలంలో అవసరం మేరకు పంపిణీ చేయడం లేదని చెప్పారు. చెరువుల చుట్టు ఉన్న ఎఫ్‌టిఎల్ భూములను గుర్తించి కాపాడాలని ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చూడాలని ఆవేదన చెందారు. చెరువుల చుట్టు రక్షణ లేకపోవడం వలన ప్రజలు, మూగజీవులు ప్రమాదాల బారిన పడుతున్నాయని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు గత ప్రభుత్వం చేపలతో కూడిన భోజనం పెడతామని హామీ ఇచ్చిందని ప్రస్తుత ప్రభుత్వం అమలుపరుచడం లేదని వాపోయారు. మత్స్యకారుల కుటుంబాలకు తాను అండగా ఉంటానని వారి సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా శక్తి ట్రెజరర్ అంబటి రమేష్, మత్స్యకారుల సంక్షేమ సంఘం డైరక్టర్ కర్కపట్ల రాము, మత్స్యకారులు కోరివి కృష్ణ ముదిరాజ్, శంకర్, అంజనేయులు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కృషి చేస్తా : సర్పంచ్ రజిత

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని ఐనపూర్‌గ్రామంలో 20లక్షల రూపాయలతో డ్వాక్రా మహిళా భవన నిర్మాణానికి సర్పంచ్ రజిత భాస్కర్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి భూమి నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానస, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ దుర్గయ్యకు సిపిఐ నాయకులు నివాళి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** భారత కమ్యూనిస్టు పార్టీ కొత్తలాపూర్ మండలం మాజీ సహాయ కార్యదర్శి, దళిత కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు కామ్రేడ్ దుర్గయ్య మృతదేహానికి శనివారం సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్‌లు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేసి వారి మృతి పార్టీకి, వారి కుటుంబానికి ప్రజలకు తీరని లోటని అన్నారు. తండ్రి నుండి వారసత్వంగా పార్టీలో పనిచేసి అనేక పదవులను అనుభవించి నిత్యం పేద ప్రజల కోసం సాయపడేవాడని, దుర్గయ్య మృతి పేద ప్రజలకు తీరని నష్టమని, అలాంటి మంచి మనిషిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. స్మశాన వాటికకు పేద వాళ్లు వస్తే అతి తక్కువ ఖర్చులతో దహన సంస్కారాలను చేసేవారని తెలిపారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడం తీరని బాధని, వారి కుటుంబానికి సిపిఐ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి, సాయిలుగౌడ్, ఏసురత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు, యువజన కార్యదర్శి వెంకటేష్, సిపిఐ నాయకులు సదానంద్, నర్సింహారెడ్డి, సాయిలు, వెంకటేష్, సహదేవరెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షులు హైమావతి, సత్యవతి, మహేశ్వరి, డేనియల్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలు జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.




**పార్టీకి తీరని లోటు**


కుత్బుల్లాపూర్ మండల సిపిఐ పార్టీ మాజీ సహాయ కార్యదర్శి దుర్గయ్య అకాల మరణం పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు. శనివారం గాంధీనగర్ ఎఐటియుసి కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ మాజి కౌన్సిలర్ నర్సయ్య, హమాలీ యూనియన్ కార్యదర్శి హరీష్‌రెడ్డి, సీనియర్ పార్టీ నాయకులు బాలనర్సయ్య, యాదగిరి, ఖాదర్, మల్లారెడ్డి, సిద్దప్ప, జగన్, మల్లికార్జున, రాజిరెడ్డి తదితరులు పాల్గొని దుర్గయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సాదక బాధకాల్లో నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# భగత్‌సింగ్ నగర్ బస్తీకి ముంపు తప్పదా..?

* అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
* భయాందోళనలకు దిగిన స్థానిక ప్రజలు





**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నాలాను కబ్జా చేసి యథేచ్ఛగా నిర్మాణం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వరద నీరు సజావుగా వెళ్లేందుకు గతంలో నాలాలను నిర్మించారు. కాని భూముల ధరలకు రెక్కలు రావడంతో నాలాలను సైతం కొందరు ప్రబుద్ధులు మింగేస్తున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేజ్ 3 లో ప్లాట్ నంబరు 179లో ఓ వ్యక్తి నిర్మాణాన్ని చేపట్టారు. సుమారు పది ఫీట్ల పొడవుతో ప్రక్కనే ఉన్న నాలాని కబ్జా చేసి యథేశ్చగా నిర్మాణాన్ని చేపట్టారు. ఇట్టి విషయం పై భగత్ సింగ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సలీముద్దీన్, మన్నన్‌లు వరుసగా అధికారులకు ఫిర్యాదు చేశారు. ముందుగా హైడ్రాకి ఫిర్యాదు చేయగా వెంటనే అధికారులు నాలాకు హద్దులను ఏర్పాటు చేశారు. దీంతో సుమారు ఆరు నెలల పాటు నిర్మాణపు పనులను నిలిపివేశారు. కాగా తాజాగా మళ్లీ నిర్మాణపు పనులను మొదలుపెట్టారు. నాలాని ఆక్రమించుకుని యథేచ్ఛగా నిర్మాణాన్ని చేపట్టారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని రాళ్లకంచె, హమీద్ బస్తీల నుండి వచ్చే ఈ నాలా సుభాష్ నగర్ మీదుగా చింతల్ వరకు వెళ్తుంది. వర్షాకాలంలో ఈ నాలా ఉవ్వెత్తున వరద నీటితో ప్రవహిస్తుంది. అయితే నాలా ప్రస్తుతం నిర్మించే నిర్మాణంతో పూర్తిగా నాలా మూసుకుపోతుంది. దీనివలన ప్రక్కనే ఉన్న భగత్ సింగ్ నగర్ బస్తీ పూర్తిగా ముంపుకి గురయ్యే అవకాశం నెలకొంది. దీంతో భగత్ సింగ్ నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రాతో పాటు జిహెచ్ఎంసి, జీడిమెట్ల ఐలా, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బి, సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా నిర్మాణ దారుడు మాత్రం ఏమాత్రం తగ్గకుండా మళ్లీ నిర్మాణపు పనులను చేపట్టడం గమనార్హం. ఆరు నెలలుగా నాలా కబ్జా ఆగినప్పటికీ మళ్లీ తాజాగా నిర్మాణపు పనులు చేపట్టడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అన్ని విభాగాల అధికారులకు బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం పై సర్వత్రా విమర్శలు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నాలా కబ్జాని అరికట్టాలని, కబ్జాదారుని పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



# గ్రామ అభివృద్ధి మా పాలకవర్గ లక్ష్యం

## గ్రామ సర్పంచ్ వడ్ల శోభ పరమేశ్వర్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గ్రామ ప్రజల అభివృద్ధి కోసం మా పాలకవర్గంతో నిరంతరం కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ వడ్ల శుభ పరమేశ్వర్ అన్నారు. శనివారం నవాబుపేట మండల కేంద్రంలోని లింగంపల్లి గ్రామంలో నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో రైతులకు ఊరట కల్పించేందుకు పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రైతుల పొలాలకు ఏర్పాటు చేసిన రోడ్లకు ఇరువైపులా పొదలు తొలగించేందుకు నూతన పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ స్వలాభాల కోసం కాకుండా గ్రామ అభివృద్ధికి పాటు పడుతూ గతంలో గ్రామ అభివృద్ధి అంతంత మాత్రంగా జరిగిన ఈ ఐదు సంవత్సరాల పాలన గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ వడ్ల శోభ పరమేశ్వర్ మాట్లాడుతూ, మన గ్రామంలో ముఖ్యంగా రైతులకు ఉన్న సమస్యలకై ముందుకు వస్తున్న పాలకవర్గం అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కొరకై ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ గ్రామ సమస్యలపై గ్రామ ప్రజలు, యువత అందరం కలిసికట్టుగా పనిచేసి గ్రామాన్ని ప్రగతి పథంలో నడుపుతామని వడ్ల శోభ పరమేశ్వర్ అన్నారు. అదే విధంగా గ్రామ సమస్యలపై ఎవరో వచ్చి ఎవరో ఏదో చేస్తారని, కాకుండా మా గ్రామ ప్రజలే నా బలం అంటూ, ప్రత్యేకంగా గ్రామ ప్రజలకు గ్రామ పెద్దలకు సహకరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# స్థలాలను కోల్పోతున్న వారికి అధిక ధరలు చెల్లిస్తాం కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** లోతుకుంట రాజీవ్ రహదారి విస్తరణలో భాగంగా స్థలాలను కోల్పోతున్న బాధిత భూయజమానులకు నష్ట పరిహారంగా మంచి ధర నిర్ణయించి ఇస్తామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపా రు. దీనికోసం తమ భూములను ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన లోతుకుంట ప్రాంతానికి చెందిన రైతులు, స్థల యజమానులతో ఆయన శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి ముందుగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నుండి శామీర్‌పేట వరకు రాజీవ్ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దీనిలోని భాగంగా పోతాయిపల్లి అవార్డు పాస్ అయిందన్నారు. తామిస్తున్న విలువైన భూములకు నష్టపరిహారంగా ఎకరానికి రూ. లక్షా 50 వేలు ఇవ్వాలని నష్టపోతున్న బాధితులు కలెక్టర్‌ను కోరారు. గత మూడేళ్లుగా లోతుకుంటలో ఎలాంటి భూ క్రయ విక్రయాలు జరుగలేదని, ఆల్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డుల్లో నమోదైన భూ ధరలను పరిగణలోకి తీసుకొని భూములను కోల్పోతున్న వారికి అత్యుత్తమ ధరలు నిర్ణయిస్తామని కలెక్టర్ జవాబు ఇచ్చారు.

# సృజనాత్మకతను వెలికి తీయడానికే విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు

## డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** చిన్నారుల్లోని దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి అన్నారు. శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి శుభోదయం కాలనీలోని ఎస్ఆర్‌డిజి స్కూల్‌లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు చిన్నతనం నుండి ఆసక్తి చూపుతున్న రంగాలలో వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు.

చర్లపల్లిలో: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా గౌతమ్ మోడల్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన కన్నుల పండువగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి సైన్స్‌ఎక్స్‌ను
















# మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

## తన చావుకు ఎవరు కారణం కాదని సుసైడ్ నోట్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఓ మహిళా కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వికారాబాద్ రాఘవకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూర్ పిఎస్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న దివ్య, వికారాబాద్ పట్టణంలోని గంగారం సాయిబాబా కాలనీలో నివాసం ఉంటుంది. శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఉండటాన్ని గమనించిన కుటంబీకులు, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆరాతీయగా ఆమె రాసిన సుసైడ్ నోట్‌లోని మాటలు అందరిని కలిచివేసాయి. నా చావుకు కారణం ఎవరు కాదు. నాన్న మన మధ్యంలో లేకపోవడం వల్లే నీకు ఇన్ని కష్టాలు ఇబ్బందులు వాస్తున్నాయి అమ్మా. నన్ను క్షమించు. అని ఆమె రాసిన నోట్‌లో ఉంది. తండ్రి లేకపోవడంతో మానసికంగా కుంగిపోయి మానసిక వేదన ఆమెను వెంటాడినట్లు తెలుస్తోంది. పోలీసులు పంచానామ చేపట్టి మృతుదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ రఘుకుమార్ తెలిపారు.



# ఉచిత మెగామెడికల్ క్యాంపు ప్రారంభం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపల్ లోని 16వ వార్డులోని జెడ్పిచ్ఎస్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగామెడికాల్ క్యాంపును మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, వార్డు కౌన్సిలర్ కడియాల వేణుగోపాల్, శ్రీని సుందర్‌రావు, లవకుమార్, సాధుసత్యనంద్ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సభ్యులకు అభినందనలు తెలిపారు. పేదలకు సేవ చేయాలంటే డబ్బులు కాదు ముందుగా మంచి మనుసు ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు, మహిళల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలకు ప్రాముఖ్యత ఇస్తాను అన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి బాలికలకు ఎగ్జామ్ ప్యాడ్లు, జామెట్రి బాక్స్, పెన్నులతో పాటుగా పాఠశాలకు స్పోర్ట్స్ కిట్ అందజేశారు.

# కలెక్టర్ మనుచౌదరికి చైర్ పర్సన్ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మేడ్చ ల్ జిల్లా కలెక్టర్‌ను అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ చెప్పారు. మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచాలని కలెక్టర్ చైర్ పర్సన్ శిరీషకు సూచించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మాజీ సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి ఉన్నా రు.

# డబుల్ బెడ్ రూమ్‌లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

## దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షుడు పిసరి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/దుండిగల్ :** డబుల్ బెడ్ రూమ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మాణాలు చేపట్టాలని దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి అన్నారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్, గాగిలాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నాయకులతో కలసి పరిశీలించారు. గాగిల్లాపూర్ 214 నాణ్యత పాటించకుండా నిర్మాణాలు చేస్తున్నారని నాణ్యతలేని ఇసుక వాడడం శోచనీయం అని అన్నారు. ఇప్పటికే దుండిగల్, గండి మైసమ్మలో ప్రజలకు పంపిణీ చేసిన ఇండ్లలో రెండు మూడు ఫ్లోర్ల వరకు మొత్తం వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిల్డింగ్‌లో ఉంటున్నామా లేదా ఏదైనా గుడిసెలో ఉంటున్నామా అనే పరిస్థితి నెలకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. నాణ్యతలేని ఇలాంటి నిర్మాణాల వల్ల భవిష్యత్తు ప్రజలకు కేటాయించిన తర్వాత కూలిపోతే జరిగే ప్రాణనష్టం ఎవరు భరిస్తారనీ, ఇలాంటి నాసిరకం నిర్మాణాల వల్ల కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నాయకుల జేబులు నిండుతాయి కానీ సామాన్యుల ప్రాణాలు మీదకు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే దీనిపైన ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.

# అస్తిపన్ను వసూలులో నిర్లక్ష్యం చేస్తే సహించం

## తాండూరు మున్సిపల్ కమీషనర్ మధుసూదన్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** ఆస్తిపన్ను వసూలలో నిర్లక్ష్యం చేస్తే సహించేదని లేదని, విధిగా అధికారులు ఆస్తిపన్ను వసూలు చేయాలని తాండూరు మున్సిపల్ కమీషనర్ మదుసుధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బిల్ కలెక్టర్‌లు, వార్డు ఆఫీసర్‌లతో కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కమీషనర్ మాట్లాడుతూ వంద శాతం పన్నులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. పాత బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో ఇంటింటికి వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చిరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మనేజర్ నరేందర్‌రెడ్డి, బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

# హెచ్‌పివి టీకా ద్వారా రాష్ట్ర భవిష్యత్తు సురక్షితం

● వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ● 90రోజుల్లో 4లక్షల బాలికలకు పంపిణీ లక్ష్యం ● కార్యక్రమం రాష్ట్ర ఆరోగ్యరంగంలో ఒక కీలకఘట్టం



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** రాష్ట్రంలో బాలికల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును సురక్షితం చేయవచ్చని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లోని కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రిలో రాష్ట్ర వ్యాప్తంగా హెచ్‌పివి టీకా పంపిణీ కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. దేశంలో ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోది రాజస్థాన్ అజ్మీర్ నుండి ప్రారంభించగా పర్చువల్‌గా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈటీకాల పంపిణీ కార్యక్రమం ఆరోగ్యరంగంలో ఒక కీలక ఘట్టం అని చెప్పారు. ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక ముఖ్యమైన ముందడుగు ఇది అని ఆయన అభివర్ణించారు. జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి వాటి వల్ల క్యాన్సర్ కేసులు పెరగుతున్నాయన్నారు. తెలంగాణలో ప్రతి సంవత్సరం 55వేల నుంచి 60వేల వరకు క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. వచ్చే అయిదేళ్లలో ఈ సంఖ్య పది శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్ర పాలసీని రూపొందించిందన్నారు. ములుగు, ఆదిలాబాద్ వంటి దూర ప్రాంతాలలో కూడా కీమో థెరపి సేవలను విస్తరించడంతో పాటు ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశామని మంత్రి చెప్పారు. మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ల ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించే చర్యలను తీసుకున్నామన్నారు. ఆరోగ్యమహిళా క్లినిక్‌ల ద్వారా విస్తృత పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్యాన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్‌లో సర్వైకల్ క్యాన్సర్ రెండో స్థానంలో ఉందన్నారు. సమయానికి టీకా తీసుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చన్నారు. 99.7శాతం హ్యూమన్‌లోమా వైరస్ వల్ల ఇది వస్తుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ. మూడు వేల నుండి నాలుగువేల రూపాయల వరకు ఖర్యయ్యే టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా జడ్ చొంగ్తూ, కమిషనర్ డాక్టర్ సంగీత సత్యానారాయణ, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేందర్, వైద్యవిధాన పరిషత్ అజయ్, హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే ఇంటింటి సౌభాగ్యం

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ఇందిరమ్మ రాజ్యంలోనే ఇందిరమ్మ ఇండ్లు ప్రజల ఇంటింట సౌభాగ్యాన్ని అందిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య స్పష్టం చేశారు. శనివారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి 3,11 వార్డులలో సాయి బాబా థియేటర్, బివిఆర్ గార్డెన్ వెనకాల నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై,మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్‌తో కలిసి, కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు మెచ్చి,ఆశీర్వదించిన ప్రజా ప్రభుత్వంలోనే ప్రజలందరూ సంతోషంగా ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాటను అమలుచేస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇంటి యజమానురాలు వనితకు కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్ చీరను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాదా ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యోగేష్, కౌన్సిలర్ లు దండు రాజేశ్వర్, గణేష్, గిరిజ చంద్రశేఖర్, లలిత మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## గ్రామంలోనే పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం నందివనపర్తి గ్రామంలోనే పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు శనివారం జిల్లా వైద్యాధికారులకు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పిహెచ్‌సి ఎర్పాటు చేయాలని గతంలోనే ఆదేశించింది. పురాతన భవనం పునర్ నిర్మాణం నిమిత్తం 5లక్షల రూపాయలు మంజూరి చేసింది. పనులు కూడ పూర్తి అయ్యాయి. ఇప్పుడు దానిని వేరే గ్రామానికి మార్చుతామని చెప్పడం సరైందికాదని తెలిపారు. నందివనపర్తి, మేజర్ గ్రామ పంచాయతీ బొల్లిగుట్ట తండా,పిల్లిపల్లి,కొమ్మోనిభావి,నీలిపోచమ్మ తండాలు ఉన్నాయి. నందివనపర్తి గ్రామంలో ఎర్పాటు చేయడం ద్వారా అనేక మంది పేదలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. చుట్టు పక్కల ఉన్న గ్రామాల పేదలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. పై అధికారులు ఇందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్‌సి మోర్చ కార్యవర్గ సభ్యులు పెరుమల్ల విక్రమ్,యాచారం మండల బిజెపి ఎస్సి మోర్చ మండల అధ్యక్షులు గడ్డం దయాకర్ ,బిజెవైఎం యాచారం మండల ప్రధానకార్యదర్శి కొండాపురం నాగరాజు,బిజెపి సినియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



**ప్రజాపక్షం/కేశంపేట:** సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకొని గిరిజనులు అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. శనివారం షాద్ నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపం సేవాలాల్ మహారాజ్ అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని సూచించారు. వ్యవసాయ పోలాల్లో ఉండే గిరిజనులను చైతన్యం చేశారని, అందుకే వారికి గిరిజనులు ఆరాధ్య దైవంగా కొలుస్తారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజను అభ్యున్నతి కోసం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.


## క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్ లభిస్తుందని ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి టి. మనోహర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చెల్క చిల్కమర్రి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన కార్యక్రమానికి ఎంఇఓ మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యంశాలను బోధించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణతో విద్యను అభ్యసిసేంచుందుకు కృషి చేయాలని సూచించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్ధగా నేర్చుకుంటే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గ్రహించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణగా ఉంటూ విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, గంట్లవెల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బిజిలి సత్యం, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**ప్రజాపక్షం/కొందుర్గు:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులకు వేగం పెంచేందుకు కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి సూచించారు. శనివారం కొందుర్గు గ్రామ పంచాయతీ కార్యాలయం 7వ వార్డులో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. కొందుర్గు మండలానికి మొత్తం రెండున్న కోట్ల హెచ్‌ఎండిఎ నిధులు వచ్చాయని, ప్రతి గ్రామ పంచాయతీ ముఖ్యకూడలిలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు వంటి అనేక పథకాలను లబ్ధిదారులకు అంధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మెన్ దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



## రైతులు సాగుచేసిన పంటలకు డిజిటల్ సర్వే చేస్తాం



**ప్రజాపక్షం/షాబాద్:** రైతులు సాగుచేసిన పంటలకు డిజిటల్ సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని ఉబగుంట, కొమరబండ, బొబ్బిలి గ్రామాల్లో పర్యటించి పంటల సాగును డిజిటల్ సర్వే చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి విజయచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పంటల సాగు వివరాలను నమోదు చేయడానికి డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. షాబాద్ మండలంలో మొత్తం 25రెవిన్యూ గ్రామాలు ఉండగా అందులో 12 గ్రామాలకు వాలంటీర్లను ఎంపిక చేసి నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ఎఇఒలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే కోసం గ్రామాల వారిగా వలంటీర్లను ఏర్పాటు చేసి రెవెన్యూ మ్యాప్ లేని గ్రామాలు, భూములకు హద్దులు లేని వాటిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. షాబాద్ మండలంలో 25 రెవెన్యూ గ్రా మాల్లో 45రోజుల పాటు పంటలు సాగుచేసిన భూములను గుర్తించి సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం

మేడిపల్లి గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్..

**ప్రజాపక్షం/యాచారం :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని మేడిపల్లి గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. శనివారం మేడిపల్లి గ్రామానికి చెందిన మోటే స్వాతికి బ్రేన్ సర్జరి నిమిత్తం ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో రూ. రూ.2,50 వేల రూపాయల ఎల్‌ఒసిని అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత భరోసా నిస్తుందని తెలిపారు. కార్పొరేటు అసుపత్రుల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేక అనేక మంది నిరుపేదలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి అపద్బంధువుగా అదుకుంటుందని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. అపదలో ఉన్న ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దెంది మధుకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి మోటే శ్రీశైలం,వార్డు మెంబర్లు ముచ్చర్ల మాధవి, నల్లోల మమత, ఎరుకలి జ్యోతి, మక్కపల్లి మహేశ్, భూర కళమ్మ, కలకోండ పద్మ, తదితరులు పాల్గోన్నారు.



## పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు



**ప్రజాపక్షం/కొత్తూరు:** పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరిష్కరించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు సూచించారు. శనివారం సాయంత్రం కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డు రూమ్ స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షెన్ సెంటర్ వంటి విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ నేరాల రేటును నియంత్రించడంతోపాటు రోడ్డు ప్రమాదాల తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీ కేసులను నియంత్రించేందుకు రాత్రి సమయాల్లో విధంగా పెట్రోలింగ్ చేయాలని, అనుమానాస్పందంగా ఉంటే విచారణ చేపట్టాలని సూచించారు. కొత్తూరు ప్రాంతం పారిశ్రామికంగా ఉండటంతో వివిధ రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో కార్మికులు జీవనోపాధి కోసం వస్తుంటారని, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిపై స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, సమస్యను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజలకు రక్షణగా పోలీసులు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో షాద్‌నగర్ డిసిపి సిహెచ్ శిరీష, షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ నర్సయ్య, రూరల్ సిఐ శ్రీనివాస్‌ల, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్‌లు అందిస్తాం

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం : వీర్లపల్లి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ నిబంధనల మేరకే పారదర్శకంగా లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లను ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం మున్సిపాల్ కార్యాలయంలో చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ అధ్యక్షతన మొదటి విడతలో 1200మంది లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద ప్రజల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని వివరించారు. అదే తరహాలో గత పాలకులు అసంపూర్తిగా నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేయించి పెండింగ్ బిల్లులు రూ.7కోట్లు చెల్లించి అదనంగా మరో రెండు కోట్లతో మరమ్మత్తులు చేపట్టి లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధం చేశామని వివరించారు. లబ్ధిదారులకు జారీ చేసిన సర్టిఫికెట్ల ఆధారంగా బ్లాక్‌లకు వెళ్ళాల్సి ఉంటుందని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్లు రానివారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని, ధరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు ఎంపిక చేసి ఇండ్లు ఇస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గానికి 3500ఇండ్లు ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. 15 రోజుల పాటు లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లను అంధించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. దూసకల్ వద్ద 368 ఇండ్లు, హాజిపల్లి ఫేస్..1 480, ఫేస్..2లో 504, సోలీపూర్ వద్ద 348 డబుల్‌బెడ్‌రూం ఇండ్లను నిర్మించినట్లు తెలిపారు. మొదటి విడతలో 1200మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అంధిచనున్నట్లు పేర్కొన్నారు. మిగత వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సునీతారెడ్డి, ఆర్‌డిఓ సరిత, తహశీల్దార్ నాగయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్‌తో పాటు కౌన్సిలర్లు, నేతలు చెంది తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, చందులాల్, రాజునాయక్‌లు పాల్గొన్నారు.

### గిరిజనుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకే సేవాలాల్ మహారాజ్ కృషి అనిర్వచనీయం

ఆదివాసి గిరిజనుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ కృషి అనిర్వచనీయమని వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటి పరిధిలోని 6వ వార్డు టీచర్స్ కాలనీలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్టించడంతో పాటు పరివార దేవతల విగ్రహాలను సైతం ప్రతిష్టించారు. దేవాలయం నుండి కేశంపేట రోడ్డు మీదుగా చౌరస్తా వరకు గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడి పోతున్న గిరిజన జాతిని రక్షించడంతోపాటు చైతన్యం తీసుకువచ్చేందుకు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు సన్మార్గంలో నడిపించేందుకు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్ రాజునాయక్, గిరిజన నేతలు దాస్‌రాంనాయక్, రాజునాయక్, సిపిఐ శ్రీను నాయక్, మిట్టునాయక్, ఏసిపి రాములు నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ , గోపాల్‌నాయక్, మంగులాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## ద్విచక్ర వాహనం, లారీ ఢీకొని మహిళా మృతి

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్:** హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి(ఎన్ హెచ్ 65) పైన అబ్దుల్లాపూర్‌మ్మెంట్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం తార్నాక వడ్డేర బస్తీకి చెందిన గండికోట లలి (35) తన మామతో కలిసి ద్విచక్ర వాహనంపై తార్నాక నుండి అబ్దుల్లాపూర్మెట్ వెళ్తుండగా వెనుక నుండి హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ బైకును ఢీ కొట్టగా కింద పడిన ఆమె తలపై నుండి దూసుకు వెళ్ళింది.ఈ సంఘటనలో లలిత అక్కడికక్కడే మృతి చెందగా ఆమె మామ లింగస్వామికి గాయాలయ్యయి. గాయపడిన లింగయ్యను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, లలిత మృతదేశాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. గండికోట లలిత సోదరుడు వరికుప్పల యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్‌పెక్టర్ అశోక్ రెడ్డి పేర్కొన్నారు.

## 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో రోడ్డు భద్రత

మోకిల పోలీస్ స్టేషన్ సిఐ వీర్‌బాబు

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** రోడ్డు ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించేందుకు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఫ్యూచర్ సీటీ కమిషనరేట్,మోకిల పోలీస్ స్టేషన్ సిఐ వీర్‌బాబు ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి స్థానిక స్కూల్,కాలేజీలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ,కాలేజీ బస్సులు సురక్షిత స్థితిలో ఉన్నాయో లేదో తరచూ తనిఖీ చేయాలని సూచించారు. అనుభవం ఉన్న డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని తెలిపారు. డ్రైవర్లకు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు,సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల ప్రాణాలు ఎంతో విలువైనవని,ప్రతి విద్యా సంస్థ భద్రతా నిబంధనలు పాటిస్తూ విద్యార్థులకు సురక్షిత ప్రయాణం కల్పించాలని పోలీసులు కోరారు.




## విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకునే అస్కారం ఉంటుందని లింగారెడ్డిగూడ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎఫ్‌సిఎన్ సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గీతా థామస్‌రెడ్డిల ఆధ్వర్యంలో 60 మందికి స్కూల్ బ్యాగులు, బెడ్ షీట్లను సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ అశోక్‌లు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు గీతా థామస్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదుకునే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని, వారికి సహాయ సహకారాలు అంధించాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నట్లు వివరించారు. పేద విద్యార్థులకు సేవ చేసేందుకు ఇలాంటి సంస్థలకు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని, మున్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలను చేపట్టాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటిస్తూ విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకర్, వెంకటయ్య, తిరుమలయ్య, వెంకటయ్య, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 173 వారం అన్నదానం

**ప్రజాపక్షం/మియాపూర్:** హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు భేష్ అని, సమాజాన్ని తనవంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పదంతో అన్న దానంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నట్లు స్థానిక ప్రజలు అన్నారు. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరవహిస్తున్న అన్న దాన కార్యక్రమంలో భాగంగా శనివారం 173వ వారం అన్న ప్రసాదంలో 2900 భక్తులు పాల్గొనగా స్థానికులతో కలిసి కొండ విజయ్ కుమార్ వడ్డించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చేయడం అరుదుగా జరుగుతుందాని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా హోప్ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకొని వారికి ఏలోటు లేకుండా చుసుకోవటం గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు రక్త దాన శిబిరం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** నేడు ఇబ్రహీంపట్నం న్యాయస్థానం ప్రాంగణం సమీపంలో జరుగు రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ఇబ్రహీంపట్నం అదనపు జిల్లా న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం న్యాయస్థానం సమీపంలో సోమవారం బార్ అసోసియేషన్, మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రక్త దాన శిబిరం గొడ పోస్టర్‌ను ఆయన ముఖ్య అతిథులుగా హజరై ప్రాంభించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ రక్త దానం చేయటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో మనిషి ప్రాణాలు కాపాడిన వాళ్ళం అవుతామన్నారు. సోమ, మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే రక్తదాన శిబిరంలో న్యాయవాదులు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులతో పాటు ప్రతి ఒకరు పాల్గోన్ని విజయవంతం చే యాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం న్యాయమూర్తులు శంకర్ దేవి, రిటా లాల్‌చందు, యశ్వంత్ సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

